క్లుప్తంగా

అయ్యప్పస్వాముల భిక్షకు విరాళం



భిక్షకు పింఛన్ సొమ్మును అందజేసిన దేముడమ్మను సత్కరిస్తున్న అయ్యప్ప భక్తులు

మునగపాక: స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న భిక్ష సదుపాయానికి తనవంతు సాయంగా మునగపాకకు చెందిన వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారి పితాపురం దేముడమ్మ మంగళవారం రూ.4 వేలు విరాళం అందజేసింది. తనకు వచ్చిన అక్టోబర్ నెల సామాజిక పింఛన్ సొమ్మును ఒక రోజు భిక్ష కార్యక్రమానికి ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఎరువుల కొరతపై రైతుల ఆందోళన



ఎరువుల కోసం ఆందోళన చేస్తున్న రైతులు

అచ్యుతాపురం రూరల్: ఉప్పవరం పంచాయతీ రైతు సేవా కేంద్రం వద్ద రైతులు మంగళవారం ఎరువుల కోసం ఆందోళన చేశారు. వరి సాగుకు అవసరమైన ఎరువులు అందట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఎరువుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నరేంద్రపురం, యర్రవరం, మళ్ళవరం గ్రామాల రైతులు యూరియా కోసం ఎండలో బారులు తీరారు. పొలాల్లో పనులు మానుకుని మరీ ఎరువుల కోసం మండుటెండలో వేచి ఉన్నా ప్రయోజనం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామాల్లో రీసర్వే పనుల పరిశీలన



రాంబిల్లి మండలంలో సర్వే పనులను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్ సూర్యారావు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని మన్యపుచింతువ, హరిపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న భూముల రీసర్వే పనులను రీసర్వే నోడల్ ఆఫీసర్ కె.సూర్యారావు మంగళవారం పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరు, ఆయా భూములకు సంబంధించిన యజమానులు సమర్పిస్తున్న దస్తావేజులపై ఆరా తీశారు. భూయజమానిని నిర్ణయించడంలో తీసుకోవాల్సిన ప్రమాణాల గురించి సిబ్బందికి సూచించారు. రోజు వారీ సర్వే విభాగ ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీవో కార్యాలయ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.వెంకన్న, రాంబిల్లి సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్: మండలంలో చీమలాపల్లి, రావిపాలెం రెవెన్యూ గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే తీరును రీసర్వే నోడల్ అధికారి కె.సూర్యారావు పరిశీలించారు. పలు విషయాలపై అధికారులు రైతులతో చర్చించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఎస్ఎల్‌వో ఎం.వెంకన్న, తహసీల్దార్ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌కుమార్, సర్వే అధికారులు పాల్గొన్నారు.

వరిలో పొడతెగులు

అనకాపల్లి: వరిలో పొడతెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు హెక్సాకొనజోల్ 2 మి.లీ లేదా ప్రొపికొనజోల్ 1 మి. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. వరిలో అగ్గితెగులు గమనిస్తే ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా ఐసోప్రోతయోలేన్ 1.5 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వరిలో బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు ఆశించవచ్చని, కాపర్ హైడ్రాక్సైడ్ (కోసైడ్) 30 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రా. 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. సుడిదోమ నివారణకు అసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నట్లయితే పైమెట్రోజిన్ 0.6 గ్రా.లేదా డైనోటెఫ్యూరాన్ 0.4 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగ, ఆకు ముడతపురుగు ఆశిస్తే, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును 2 గ్రా. లేదా అసిఫేట్ 1.5 గ్రా. తల్లి పురుగు లేక గుడ్ల సముదాయం కనిపించినట్లయితే ఎకరాకు 8 కిలోల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జిమ గుళికలను వేయాలి. లేదా 4 కిలోల క్లోరాంత్రనిలిప్రోల్ గుళికలను 8 కిలోల ఇసుకలో కలిపి చల్లుకోవాలని సూచించారు. అంకురం దశలో ఉన్న వరి పైరుకు మూడో దఫా యూరియాను ఎకరానికి 25 కిలోల చొప్పున, 17 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను బురద పదును చూసుకుని సమానంగా జల్లాలి. కందిలో వడలు తెగులు గమనించినట్లయితే, కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటికి 3 గ్రా. చొప్పున కలిపి మొక్కల మొదళ్ల తడిచేల పిచికారీ చేయాలని సూచించారు. శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, డి.ఆదిలక్ష్మి, వి.గౌరీ, సీహెచ్. రామలక్ష్మి, వి.చంద్రశేఖర్, అలివేణి పాల్గొన్నారు.

వంతెనల గతి ఇంతేనా.!

- ప్రధాన రహదారుల్లో కానరాని వంతెనలు
- ప్రమాదాల అంచున రాకపోకలు
- రామచంద్రపురం జంక్షన్‌లో శిథిలమైన వంతెన
- లింగాపురం–కొడవటిపూడి రోడ్డులో మినీ గెడ్డపై కల్వర్టు లేక అవస్థలు



రామచంద్రపురం జంక్షన్‌లోని శిథిలమైన వంతెన

కోటవురట్ల: కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే రోడ్లను బాగుచేస్తాం.. మారుమూల గ్రామాలకు సైతం రహదారులను నిర్మిస్తాం.. రోడ్లన్నీ అద్దాల్లా మెరిసిపోతాయ్.. వంతెనలు నిర్మించేస్తాం.. ఇవన్నీ ఎన్నికల ముందు హామీలు. అంతేకాదు గోతుల ముందు కూటమి నాయకులు నిలుచుని సెల్ఫీలు తీసి సోషల్ మీడియాలో తెగ హడావుడి చేసేవారు. ఇంకే ముంది కూటమి ప్రభుత్వం వస్తే రోడ్లన్నీ బాగుపడతాయ్. రయ్‌ను దూసుకుపోవచ్చని అంతా అనుకున్నారు. తీరా కూటమి ప్రభుత్వం వచ్చాక తెలిసింది. ఇదంతా చంద్రబాబు మార్కు హామీలని. అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర కావస్తున్నా ఎక్కడి గొంగలి అక్కడే అన్నట్టు అభివృద్ధి జాడ ఎక్కడా కానరాలేదు. రహదారులు మరింత దారుణంగా తయారయ్యాయి. వంతెనలు శిథిలమయ్యాయి. వెరసి వాహనదారులకు అవస్థలు మరింత పెరిగాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మండలంలోని పలు రహదారులను సుమారు రూ.12 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశారు. మరికొన్ని రహదారులను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రహదారుల జోలికి పోకపోవడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు.



మట్టితో నిర్మించిన డైవర్షన్ రోడ్డు

డైవర్షన్ రోడ్డే దిక్కు

రామచంద్రపురం జంక్షన్‌లోని మినీ వంతెన ఏడాది క్రితం శిథిలమై కుంగిపోయింది. నాలుగు మండలాలకు ప్రధాన రహదారి కావడంతో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులను కూడా నిలిపివేశారు. దాంతో తాత్కాలికంగా రూ.50 లక్షలు వెచ్చించి పక్కనే మట్టితో డైవర్షన్ రోడ్డు వేశారు. ఈ రోడ్డు బాగా దిగువకు వేసి కాంట్రాక్టరు చేతులు దులిపేసుకున్నాడు. మట్టిరోడ్డుకు రూ.50 లక్షల ఖర్చా అంటూ అందరూ ముక్కున వేలేసుకున్నారు. అయినా మట్టితో నిర్మించిన ఆ డైవర్షన్ రోడ్డే ఇప్పుడు దిక్కయింది. గట్టిగా వర్షం కురిస్తే ఈ డైవర్షన్ రోడ్డు కూడా కొట్టుకుపోయే పరిస్థితులు ఉన్నాయి. డైవర్షన్ రోడ్డు వేసి దాదాపు ఏడాది కావస్తున్నా కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదన పెట్టలేదు. నర్సీపట్నం, ఎస్.రాయవరం, మాకవరపాలెం, కోటవురట్ల మండలాలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు.



లింగాపురం–కొడవటిపూడి రహదారిలో ప్రవహిస్తున్న గెడ్డనీరు

వర్షం పడితే రాకపోకలు బంద్

లింగాపురం–కొడవటిపూడి రహదారిలో ఓ చోట గెడ్డనీరు పోయేలా కాలువలా వదిలేశారు. ఈ ప్రాంతంలో గట్టిగా వర్షం పడితే చాలు గెడ్డ కాలువ పొంగి ప్రవహిస్తుంది. రహదారిలో ఏలేరు కాలువలా మారిపోతుంది. దాంతో ఇరువైపులా రాకపోకలు బంద్ అవుతున్నాయి. కాకినాడ జిల్లా తుని వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తారు. వర్షా కాలంలో తరచూ ఇక్కడ గెడ్డ కాలువ ప్రవాహంతో వాహనదారులు గంటల కొద్దీ ఆగిపోయిన సంఘటనలు ఉన్నాయి. వాస్తవానికి ఇక్కడ కల్వర్టు నిర్మించి గెడ్డ నీరు పోయేలా ఏర్పాటు చేయాలి. దీనికి భారీగా నిధులు సమకూర్చాల్సిన అవసరం కూడా లేదు. తాజాగా వారం క్రితం ఈ రహదారిలో గెడ్డ కాలువ పొంగి ప్రవహించడంతో రెండు వైపులా వాహనదారులు సుమారు గంటపాటు ఆగిపోయారు. అధికారులు స్పందించి ఇక్కడ కల్వర్టు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

మినీ వంతెన నిర్మించాలి..



రామచంద్రపురం జంక్షన్‌లో మినీ వంతెన నిర్మించాలి. ఏడాది క్రితమే ఈ వంతెన శిథిలమైంది. పక్కనే డైవర్షన్ రోడ్డు నిర్మించి చేతులు దులిపేసుకున్నారు. భారీ వర్షాలు పడితే ఈ డైవర్షన్ రోడ్డు కూడా కొట్టుకుపోయేలా ఉంది. సమస్య రాకముందే మినీ వంతెన నిర్మించి పరిష్కారం చూపాలి.

–నిమ్మల కృష్ణారావు, కోటవురట్ల

గెడ్డ వద్ద కల్వర్టు లేక ఇబ్బందులు



లింగాపురం–కొడవటిపూడి రహదారిలో కల్వర్టు నిర్మించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవట్లేదు. గట్టిగా వర్షం పడితే రోడ్డు మధ్యలో కాలువ పొంగి ప్రవహిస్తోంది. దాంతో ప్రయాణికులు గంటల తరబడి ఆగిపోతున్నారు. కల్వర్టును నిర్మించాలని కోరుతున్నాం.

–త్రినాథ్, కొడవటిపూడి

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: యలమంచిలి విద్యుత్ సెక్షన్ రాంబిల్లి 11 కేవీ రూరల్ ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా గురువారం ధర్మవరం, సోమలింగపాలెం, కట్టుపాలెం, కొత్తపాలెం, రామారాయుడుపాలెం గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులంతా గమనించాలని కోరారు.

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం టౌన్, ఎస్.రాయవరం పరిధిలో ఆక్వా కల్చర్, ఉప్పరాపల్లి, వెంకటాపురం, లింగరాజుపాలెం, జేవీపాలెం, సర్వసిద్ధి, కర్రివానిపాలెం, బసవపాడు, సైతారుపేట, వాకపాడు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పాటిపల్లి మాజీ సర్పంచ్ సింహాచలంకు పరామర్శ



సింహాచలం కుమారుడు శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక: పాటిపల్లి మాజీ సర్పంచ్ చందనాటి సింహాచలం కుటుంబ సభ్యులను మంగళవారం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పరామర్శించారు. సింహాచలం గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ప్రసాద్ మంగళవారం సింహాచలం కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరావును పరామర్శించి తల్లి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసరి అప్పారావు, నరాలశెట్టి సూర్యనారాయణ, మొల్లేటి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన



గణపర్తిలో డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక: మండలంలోని గణపర్తిలో డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాంబిల్లి మండలం హరిపురం బీసీటీకి చెందిన ఎస్ఎల్ఎఫ్‌సీ పీడీ కేవీ సీతారామరాజు, కో–ఆర్డినేటర్ పీడీవీ రత్నకుమార్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో పంటలకు ఎరువులు, తెగుళ్ల నివారణకు సంబంధించి పిచికారీ చేసుకునేందుకు డ్రోన్లు ఎంతగానో దోహదపడతాయన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు కూడా అందుబాటులో ఉండే సాంకేతికతను వినియోగించుకోవాలన్నారు. రైతులు మారిశెట్టి వెంకటరమణ, కాళ్ల చంద్రమోహన్, గోవింద్, చదరం గౌరీ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్క్యులర్ నిలుపుదలపై హర్షం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు రూపాదేవి

అనకాపల్లి: వీవోఏ(విలేజ్ ఆర్గనైజింగ్ అసిస్టెంట్)ల మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను ప్రభుత్వం నిలుపుదల చేసిందని ఏపీ వెలుగు వీవోఏ యానిమేటర్ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్.రూపాదేవి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడుతూ వీవోఏల మూడు సంవత్సరాల కాలపరిమితిని రద్దు చేయాలని ఎన్నో పోరాటులు చేశామన్నారు. జిల్లాలో 1,292 మంది వీవోఏలు 39,579 స్వయం సహాయక సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు వి.వి. శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, వీవోఏలు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై రాజీలేని పోరాటం



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

రాంబిల్లి(అచ్యుతాపురం): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై రాజీలేని పోరాటం చేస్తామని వైఎస్సార్ సీపీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. రాంబిల్లి మండలం రాజకోడూరు, వెంకటాపురం గ్రామాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అందుకే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టామన్నారు. చంద్రబాబు మోసాలు, అబద్ధపు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే రచ్చబండ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి ఎంపీపీ శ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పిన్నమరాజు కిశోర్, సీనియర్ నాయకులు నెట్టెం సత్యనారాయణ, ప్రచార కమిటీ అధ్యక్షుడు కొవిరి రామకృష్ణ, యువజన విభాగం అధ్యక్షుడు ధూళి వెంకి, కేజీ పాలెం సర్పంచ్ హరిబాబు, రాజకోడూరు ఎంపీటీసీ వెంకటరావు, హరిపురం సర్పంచ్ బుజ్జి, కర్రి శ్రీనివాసరావు, వెంకటాపురం సర్పంచ్ కిలాడి తాతబ్బాయి, చీర మహాలక్ష్మి, ధూళి సూర్యచంద్ర, వియ్యపు చిరంజీవి, రోమాల మూలరాజు, సరిపల్లి పైడిరాజు, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమ్మె విజయవంతం చేయాలి



వెంకటాపురం సబ్‌స్టేషన్ ఎదురుగా కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మునగపాక: విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు కరపత్రాలను మంగళవారం మండలంలోని వెంకటాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి విద్యుత్ ఉద్యోగ, కార్మికులు చేపడుతున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఒకేలా వేతనం అందించాలన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్ డీఏను వెంటనే విడుదల చేయాలన్నారు. పీఆర్‌సీ కమిటీని నియమించాలన్నారు. యూనియన్ నాయకులు సుందరపు రామన్న దొర, కర్రి భాను, మద్దాల జగన్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలోని అచ్యుతాపురం, కొండకర్ల సబ్‌స్టేషన్లలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు, డిమాండ్లు పరిష్కరించకుంటే ఈ నెల 14న వర్క్ టూ రూల్, 15 నుంచి సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు ఆర్ రాము, కె.సోమునాయుడు, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు మోహన్, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాలతో కుట్రలు తిప్పి కొట్టాలి



భీమవరం గ్రామంలో కోటి సంతకాల సేకరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

ఎస్.రాయవరం: కూటమి ప్రభుత్వం చేసే కుట్రలను కోటి సంతకాల సేకరణతో తిప్పి కొట్టాలని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పిలుపునిచ్చారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ భీమవరం గ్రామంలో మంగళవారం కోటి సంతాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ధ్వజమెత్తారు. పేదలకు మెరుగైన వైద్యం, విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 17 కళాశాలలను నెలకొల్పితే, కూటమి ప్రభుత్వం కుట్రలు చేసి ప్రైవేటు పరం చేసేందుకు సిద్ధమవుతోందన్నారు. దానిని అడ్డుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాలు సేకరించి గవర్నర్‌కు అందజేయనున్నట్టు తెలిపారు. చంద్రబాబు పాలన ఎప్పుడూ పేదలకు, మధ్యతరగతి ప్రజలకు వ్యతిరేకంగా సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ఏఎన్ మధువర్మ, ఉపాధ్యక్షుడు వెదుళ్ల బంగారి, మైలపల్లి రాజారావు, వైస్ ఎంపీపీ బోడిపల్లి అప్పన్న, ఎంపీటీసీలు నాగంబోయిన శ్రీనివాసరావు, బొండా దివాణం, పార్టీ నాయకులు అద్దేపల్లి నూకునాయుడు, చింతలపాటి మణిరాజు, ఐవీ రత్నం, చేకూరి శ్రీరామచంద్రరాజు, గరగా శ్రీను, వెంకటరమణ, కంచిమూతి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

31వ రోజుకు మత్స్యకారుల నిరాహార దీక్ష



నిరాహార దీక్షలో పాల్గొన్న సీపీఐ నాయకులు



రాంబిల్లి మండలం గజిరెడ్డిపాలెంలో నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ రాజయ్యపేట మత్స్యకారులు చేపట్టిన నిరాహార దీక్ష 31వ రోజుకు చేరుకుంది. మంగళవారం సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, వెలుగుల అర్జునరావు తదితరులు దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజులకు పైనే మత్స్యకారులు దీక్ష చేస్తున్నారన్నారు. ప్రాణ భయంతోనే వీరంతా వేట మానుకుని పస్తులతో పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వ వైఖరితో కడుపు మండిన మత్స్యకారులు జాతీయ రహదారిని ముట్టడించి నాలుగు గంటల పాటు ధర్నా చేశారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి మత్స్యకారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని బల్క్ డ్రగ్‌పార్క్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర ప్రాంతాల్లో వ్యతిరేకించిన బల్క్ డ్రగ్ పార్క్‌ను రాజయ్యపేటతో ఏర్పాటు చేయడం తగదన్నారు. రద్దు చేస్తున్నట్లు ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. దీక్షకు మద్దతు ఇస్తున్న వామపక్ష నాయకులను గృహ నిర్బంధాలు కొనసాగుతున్నాయన్నారు. బుధవారం రాజయ్యపేటలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి మత్స్యకారులు, మత్స్యకార సంఘాలు, అన్ని రాజకీయ పార్టీ నాయకులను ఆహ్వానించాలని కోరారు. ఈ ఆందోళనలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, మత్స్యకార నాయకులు పిక్కి తాతీలు, ఎరిపిల్లి నాగేశు, బైరాగి రాజు, సోమేష్, మహేష్, నారాయణరావు, రాజశేఖర్, అప్పలరాజు, సూరిబాబు, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

గజిరెడ్డిపాలెంలో మత్స్యకారుల నిరసన

రాంబిల్లి(అచ్యుతాపురం): బల్క్ డ్రగ్ పార్కును వ్యతిరేకిస్తూ ఉద్యమిస్తున్న రాజయ్యపేట మత్స్యకారులకు మద్దతుగా రాంబిల్లి మండలం గజిరెడ్డిపాలెంకు చెందిన మత్స్యకారులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తీర ప్రాంతాల్లో కాలుష్య కారక పరిశ్రమలు వద్దని, మత్స్యకారుల పొట్టకొట్టొద్దంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేవుడు నాయుడు, మత్స్యకారులు ఎరిపిల్లి రాము, ఎరిపల్లి నూకరాజు, చేపల కాసుబాబు, చెల్లూరు దావిద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం వినతి



ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న కృష్ణంపాలెం బాధితులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ ద్వారా భూములను తీసుకొని ఇప్పటి వరకూ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని, తమ తగిన న్యాయం చేయాలని కోరుతూ కృష్ణంపాలెం బాధితులు మంగళవారం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. 2006లో భూములు తీసుకొని పరిహారం ఇచ్చారని, గ్రామ తరలింపులో భాగంగా అమలు చేసే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలో తీవ్ర గందరగోళం సృష్టిస్తున్నారని వారు వాపోయారు. 2023 సెప్టెంబర్ 9న విడుదల చేసిన జీవో నంబర్ 846 ప్రకారం 32.49 ఎకరాల భూమిని పంచదార్ల రెవెన్యూ పరిధిలో కేటాయించినప్పటికీ అప్పుడు ఎంపిక చేసిన అర్హులను మళ్లీ మార్చారని ఆరోపించారు. 2023 ఎన్యుమరేషన్‌లో అర్హులైన వారిని మళ్లీ 2025లో చేపట్టిన ఎన్యుమరేషన్‌లో అనర్హులుగా మార్చి మళ్లీ కొత్తవారిని చేర్చి లాటరీ పద్ధతిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద దిబ్బపాలెం సెజ్ పరిధిలో ఇళ్ల స్థలాలు ఇస్తామనడం అన్యాయమన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో అర్హుల జాబితాను మార్చిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. 2023 ఎన్యుమరేషన్ ప్రకారం గుర్తించిన అర్హులకు పంచదార్లలోనే ఇళ్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పునరావాసం కల్పించే వరకూ గ్రామ పరిధిలోని పాకలు, ఇళ్లు తమ అనుమతి లేకుండా తొలగించవద్దని కోరారు.

‘అగ్నికర్’ పోస్టర్ ఆవిష్కరణ

అచ్యుతాపురం: అచ్యుతాపురంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అగ్నికర్ పోస్టర్‌ను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆవాస్ యోజన–అర్బన్ కింద లబ్ధిదారులకు అందే ప్రయోజనాలు, పథకం లక్ష్యాల గురించి వివరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు

అచ్యుతాపురం: యలమంచిలి నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సూచించారు. ఏపీఐఐసీ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మంగళవారం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. వ్యవసాయ విభాగంలో అధునాతన సంస్కరణలు తీసుకురావాలన్నారు. పీ–4 సర్వేపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

రావికమతం: కొత్తకోట హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థినులకు వృత్తి విద్యా –స్వయం ఉపాధి కోర్సుల్లో నైపుణ్యంపై ప్రత్యేక శిక్షణ పథకం కింద బాలికలకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ పరిజ్ఞానం, రైల్వే రిజర్వేషన్ టికెట్ బుకింగ్, ఆన్‌లైన్ సర్వీసులపై అవగాహన కల్పిస్తూ పది మంది విద్యార్థులు శిక్షణ పొందారని హెచ్ఎం జేజే రాజ్‌కుమార్ చెప్పారు. ఒకేషనల్ ట్రైనర్ ఎస్.మీనాక్షి విద్యార్థులకు వృత్తి నైపుణ్యంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు స్వయం ఉపాధికి వృత్తి నైపుణ్య శిక్షణ దోహదపడుతుందని హెచ్ఎం చెప్పారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పోటీలు



జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న రావాడ నాయుడు



పరుగు పోటీల్లో దౌడు తీస్తున్న గుర్రం

నాతవరం: డి.యర్రవరంలో నల్లకొండమ్మ తల్లి పండగ నిర్వహించిన గుర్రాల పరుగు పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. మొత్తం 16 గుర్రాలు పాల్గొన్నాయి. విజేతలకు నిర్వాహకులు నగదుతో పాటు అమ్మవారి షీల్డు అందజేశారు. విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.12వేలు, రూ.10 వేలు,రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. పాల్గొన్న మిగిలిన గుర్రాల యజమానులకు రూ.2వేలు చొప్పున నగదు, షీల్డు అందజేశారు. పోటీలను నర్సీపట్నం చెందిన జ్యూయలరీ వ్యాపారి రావాడ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

యలమంచిలి రూరల్: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి సమీపంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న అమలకంటి నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్సై ఎం ఉపేంద్ర మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తమ సిబ్బంది కృష్ణాపురం వెళ్లి నిందితుడ్ని తనిఖీ చేయగా, అతడి వద్ద నాలుగు మద్యం బాటిళ్లు పట్టుబడినట్టు పేర్కొన్నారు.